ప్రజాశక్తి
సోమవారం 16 అక్టోబర్ 2023 5 అనంతపురం



అర్హులందరికీ ఇళ్లపట్టాలు : మంత్రి ఉషశ్రీచరణ్


ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అర్హులందరికీ ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తామనిరాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారంకంబదూరు మండల కేంద్రంలోని ఓబయ్య కాలనీలో అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు జగనన్న ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిపట్టా అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

పుట్టపర్తి ఫ్యాన్‌లో మూడు రెక్కలాట





ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల సమయంలో రచ్చ
పర్యటన రద్దుతో ఎవరికి వారుగా మౌనం
ఆయోమయంలో పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పుట్టపర్తి వైసిపిలో ముగ్గురు నేతల మధ్య మూడు రెక్కలాట నడుస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సీటు దక్కించుకునేందుకు ఎవరికి వారుగా పావులు కదుపుతుండటం గమనార్హం. ఈ క్రమంలో నాయకుల మధ్య విభేదాలు పొడచూపుతుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమూ అవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఖరారై, తరువాత రద్దయింది. రద్దవకముందు ఏర్పాట్ల పరిశీలనకు ముఖ్య నేత ఒకరు పుట్టపర్తికి విచ్చేశారు. ఆ సమయంలో ఆయన ముందు కూడా అసంతృప్తి నేతలు తమ వాదనలను బలంగా వినిపించినట్టు వైసిపిలో చర్చ నడుస్తోంది.సిట్టింగు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఇద్దరు నాయకులు ఫిర్యాదులు సైతం చేసినట్టు తెలుస్తోంది. అందుకు ప్రతిగా శ్రీధర్‌రెడ్డి కూడా స్పందించడంతో ముఖ్యమంత్రి పర్యటన సమయంలో ఈ గ్రూపు విభేదాలు రచ్చకెక్కుతాయా అన్న విధంగా సాగినట్టు కూడా పార్టీ వర్గాల్లో చర్చ నడిచింది. అదే సమయంలో ముఖ్యమంత్రి పర్యటనలో మార్పు జరిగింది. సిఎం పర్యటన పుట్టపర్తి నుంచి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు మారింది. ఈ గొడవల నేపథ్యంలో మార్పు జరిగిందన్న ప్రచారమూ పార్టీలో చర్చ జరుగుతుండటం గమనార్హం. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థిత్వాల కోసమే ఈ పోటీ నడుస్తోంది. ఇప్పటికే సిట్టింగు ఎమ్మెల్యేగానున్న శ్రీధర్‌రెడ్డి 2019 ఎన్నికలకు ముందు రాజకీయరంగ ప్రవేశం చేసి పుట్టపర్తి స్థానాన్ని దక్కించుకున్నారు. తొలి ప్రయత్నంలోనే వైసిపి తరుపున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే ఆయనపై అనేక విమర్శలు, ఆరోపణలూ ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఆయన సంస్థలకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ స్థానం మార్పు జరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఆయన తిరిగి పోటీకి ఉండేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. మార్పు ప్రచారం నేపథ్యంలో మరో ఇద్దరు నాయకులు రంగంలోకి దిగారు. మాజీ ఎమ్మెల్యే పాముదుర్తి రవీంద్రారెడ్డి తనయుడు పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి ఉన్నారు. గతంలో ఆయన తండ్రి రవీంద్రారెడ్డి ఈ నియోజకవర్గంలో అంటే పుట్టపర్తి కంటే ముందు నల్లమాడ నియోజకవర్గంగానున్న సమయంలో పట్టుండేది. ఆయన మరణం తరువాత నుంచి ఆయన కుమారుడు కొంత దూరంగానున్నట్టు కనిపించినా తిరిగి ఆయన రంగంలోకి దిగేందుకు ప్రత్నిస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. ఇక సోమశేఖర్‌రెడ్డి 2014 ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో ఆయన కాకుండా శ్రీధర్‌రెడ్డికి అవకాశం దక్కింది. అయితే ఇప్పుడు ఆయన కూడా మరోమారు రంగంలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఇక్కడ ముగ్గురి మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడమే కాకుండా విభేదాలు నెలకొంటున్నాయి. ముగ్గురు మూడు రకాలుగా ప్రయత్నాలు చేసుకునే క్రమంలో పార్టీ కార్యకర్తలో కొంత గందరగోళం, అయోమయయం నెలకొంటోంది. దీన్ని సర్దుబాటును అధినాయకత్వం ఏ విధంగా చేస్తుందోనన్నది ఆసక్తికరంగా మారింది. కొత్తగా జిల్లా కేంద్రమూ అయిన పుట్టపర్తి నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు ఇంకా జరగాల్సి ఉంది. రాబోయే రోజుల్లో రాజకీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతంగానూ పుట్టపర్తి ఉండనుంది. ఈ క్రమంలో ఇక్కడ ఎవరికి వైసిపి అధిష్టానం ప్రాధాన్యత కల్పించి వచ్చే ఎన్నికల బరిలో దింపుతుందన్నదీ ఆసక్తికరంగా మారింది.







పక్కాగా ఇవిఎంల మొదటి దశ తనిఖీ

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఇవిఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం చేపట్టేందుకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. ఆదివారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్ లో ఉన్న ఇవిఎం గోడౌన్లో ఈనెల 16వ తేదీ నుంచి చేపట్టనున్న ఇవిఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తో కలిసికలెక్టర్ ఎం.గౌతమి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ నుంచి నవంబర్ 10 వరకు ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని అధికారులను ఆదేశించారు. తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రీ దేవి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎ.హనుమంతు, ఆర్డీవోలు మధుసూదన్, రవీంద్ర, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, జిల్లా ఫైర్ అధికారి, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ లెవెల్ చెకింగ్ పై శిక్షణ : ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న ఇవిఎంలు, వివి ప్యాట్స్ ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమంపై డిఆర్ఓ గాయత్రీ దేవి, ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్రలు విధులకు కేటాయించిన సిబ్బందికి నగరంలోని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫస్ట్ లెవెల్ చెకింగ్‌లో పాటించాల్సిన నియమ నిబంధనలు, సూచనలు తెలియజేశారు. ఎవరూ కూడా సెల్ ఫోన్లు, కెమెరాలు, స్పై కెమెరాలు లాంటివి తీసుకురాకూడదని, ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.



తనిఖీ ఏర్పాట్లపై ఎస్పీతో చర్చిస్తున్న కలెక్టర్

గుత్తికోట రైల్వే స్టేషన్‌లో సమస్యల తిష్ట



ఆర్భాటంగా ప్రారంభం
11 నెలలు గడిచినా సౌకర్యాలు శూన్యం
ఇబ్బందుల్లో ప్రయాణికులు



గుత్తి కోట రైల్వే స్టేషన్ ముఖద్వారం

ప్రజాశక్తి గుత్తి

గుత్తి కోట రైల్వే స్టేషన్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. గతంలోని రైల్వేస్టేషన్లో రైళ్ల రద్దీ తగ్గించడంతో పాటు బెంగళూరు నుంచి చెన్నైకు గూడ్స్ రైళ్లను బైపాస్ లైన్ లో మళ్లించేందుకు పట్టణ శివారులో నూతనంగా గుత్తి కోట రైల్వే స్టేషన్ (హాల్ట్ స్టేషన్) ను నిర్మించారు. కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.50 కోట్లతో నిధులతో నిర్మాణపు పనులు మొదలుపెట్టింది. గత ఏడాది నవంబర్ 29వ తేదీన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ గుత్తి కోట రైల్వే స్టేషన్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. చెన్నై నుంచి బెంగళూరుకు, బెంగళూరు నుంచి చెన్నై కు పలు గూడ్స్ రైళ్ల రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 18 తేదీన గుత్తి కోట రైల్వే స్టేషన్ మీదుగా ఎక్స్ ప్రెస్ రైలును ప్రారంభించారు.రైల్వే స్టేషన్ మీదుగా ధర్మవరం నుంచి మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు (17216) ప్రతి రోజు సాయంత్రం 6:30 గంటలకు, మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్ళే ఎక్స్ ప్రెస్ రైలు (17215) ఉదయం 8 గంటలకు వెళుతుంటాయి. గుత్తి సమీప ప్రాంతాల నుంచి వందలాదిమంది ప్రయాణికులు ఎక్స్ ప్రెస్ రైళ్లలో ప్రయాణం కొనసాగిస్తున్నారు. అయితే స్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. రైల్వే స్టేషన్ లోని ప్లాట్‌ఫారంలో ప్రయాణికులు నిల్చోడానికి షెడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులకు నిలువనీడ లేకుండా పోయింది.ఎండలకు ఎండుతూ వానలకు తడవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్లాట్ ఫారంపై కొళాయిలు నిర్మించారే కానీ తాగునీటిని సరఫరా చేయలేదు. ప్రయాణికులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. హాల్ట్ ఏజెంట్ శ్రీకరం నరేష్ మినరల్ వాటర్ క్యాన్లను స్టేషన్ తెప్పించి రైల్వే ప్రయాణికుల దాహార్తి తీరుస్తున్నారు. ప్లాట్‌ఫారంపై మరుగుదొడ్లు నిర్మించారేకాని నీటి సౌకర్యం కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి గుత్తి కోట రైల్వే స్టేషన్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



గుత్తి కోట రైల్వే స్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి. ప్లాట్ ఫారంలో ఉన్న కొళాయిలకు తాగునీటిని సరఫరా చేయాలి. టాయిలెట్లలో నీటి సౌకర్యం లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి

అనిత,
ప్రయాణికురాలు, ప్రొద్దుటూరు.

ప్రయాణికులకు నిలువ నీడ లేదు



ప్రతిరోజూ రైళ్లలో ప్రయాణం చేస్తున్నాను. రైల్వే స్టేషన్లో షెడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలకు ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు వస్తే తడవాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేషన్లో సౌకర్యాలు కల్పించాలి.

ఆది నిఖాల్సన్,
ప్రయాణికుడు, గుంటూరు.

ఎండుతున్న మిరప పంట

ప్రజాశక్తి-పెద్దవడుగూరు




రక్షక తడులకు అన్నదాతల కష్టాలు
ట్యాంకర్ల ద్వారా నీరిచ్చేందుకు పాట్లు

రోజురోజుకూ ఎండలు అధికమవుతుండటంతో మండలవ్యాప్తంగా రైతులు సాగు చేసిన మిరప పంట ఎండుదశకే చేరుకుంది. మండలవ్యాప్తంగా దాదాపు 450 హెక్టార్లలో మిరప పంటను సాగుచేశారు. పంట సాగు చేసి నాలుగు మాసాలు అవుతున్నా ఒక్కసారి మోస్తారు వర్షం కురవలేదు. దీంతో తేమశాతం అనుకున్నంత లేకపోవడంతో మొక్కలు వాడుదశకు చేరుకోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అటు వర్షం లేక.. ఇటు పంట కాలువలకు నీరు అందించక రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. మండలంలో ఎక్కువ శాతం రైతులు మిరప పంటపైనే ఆధారపడి సాగు చేస్తుంటారు. ఈనేపథ్యంలో ఈఏడాది అనుకున్నంత వర్షాలు కురవలేదు. దీంతో హెచ్చెల్సీ కాలువ నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు అంటేన్నారు. ప్రస్తుతం పెద్దవడుగూరుతోపాటు లక్షులపల్లి, చిన్నవడుగూరు, మిడుతూరు ప్రాంతాల్లో మిరప మొక్కలను రక్షించుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటితడులను అందిస్తున్నారు. ఈమాసంలో సాగునీరు విడుదల చేయకపోతే మిరప పంటపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందనిరైతులు వాపోతున్నారు. అలాగే మిరపతోపాటు పత్తి, వేరుసెనగ, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సైతం ఎందుదశకు చేరాయి. వర్షం జాడ ఇప్పట్లో లేనందున ఒక సాగునీటి కాలువలకు నీటిని అందించి రైతులను ఆదుకోవాలని పలుగ్రామాల రైతులు కోరుతున్నారు.

ఎలుగుబంటి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం-కంబదూరు ప్రధాన రహదారిలో ఆదివారం ఉదయం ఓ ఎలుగుబంటి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఉదయం ఆ రహదారి గుండా ప్రయాణిస్తున్న ప్రయాణికులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. అటుగా వెళ్తున్న ఏదైనా వాహనం ఢీకొనడంతో ఎలుగుబండి చనిపోయిందా.. లేక వేటగాళ్లు ఎవరైనా చంపారా.. అధికారుల విచారణలో తెలియాల్సి ఉంది.



మృతిచెందిన ఎలుగుబంటి

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయం

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడమే ధ్యేయమని ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తెలిపారు. విడపనకల్లు మండలం డోనేకల్లు గ్రామంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్, సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూ.20లక్షలతో నిర్మించిన సామాజిక నీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ హైదరాబాద్ వారిని నీటి ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరిన వెంటనే పలుగ్రామాల్లో సామాజిక నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అంతేగాకుండా గ్రామంలో దాదాపు రూ.90 లక్షలతో పూర్తి చేసిన సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన సర్పంచి ఎర్రమ్మను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎర్రమ్మ, ఎంపిటిసి లక్ష్మి సత్యమయ్య, మాజీ సర్పంచులు లింగారెడ్డి, మల్లికార్జున, భీమలింగప్ప, అంగడి ఈశ్వరప్ప, పంపావతి, సురేష్, రాముడు, మాజీ ఎంపిపిలు రమణారెడ్డి, తిప్పయ్య, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రమణయాదవ్, సర్పంచులు జయేంద్రరెడ్డి, తిరుపాల్‌యాదవ్, ఇందిరమ్మ, రెనుమాకులపల్లి రామంజినేయులు, శివలింగ, వైసిపి నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, చంద్రమోహన్‌రెడ్డి, గడేకల్ పంపాపతి, దిద్దేకుంట సూరి, ముష్టూరు ఎర్రిస్వామి, మాలపురం కేసన్న, గురుస్వామి, హావళిగి రాముర్రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం



శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత పది సంవత్సరాల నుండి పండ్ల తోటల పెంపకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారనివీరికి ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహాలు ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తున్నామనిశ్రీ సత్య సాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గతంలో తీవ్ర వర్షాభావం ప్రభావంతో రైతులు పండ్ల తోటలు ఎండిపోయి నష్టపోయారని అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి జిల్లాలో బాగా వర్షాలు కురిసాయని ఈ ఏడు వర్షభావ పరిస్థితులతో పండ్ల తోటలు దెబ్బతింటున్నాయని చెప్పారు. పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తోందని దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు.

ప్రశ్న: పండ్ల తోటల పెంపకంలో రైతులు ఎలాంటి ఆసక్తి చూపుతున్నారు?

జవాబు : తరచూ అతివృష్టి అనావృష్టి పరిస్థితుల వల్ల రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వారు పండ్ల తోట పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పండ్ల తోటలో పెంపకానికి ప్రోత్సాహాలు ఇస్తోంది. ఉపాధి హామీ పథకం క్రింద పండ్లతోటల పెంపకం చేసే రైతులకు మొక్కలు నాటే దశలో గుంతలు తీయడానికి, మొక్కల సంరక్షణకు మొక్కలు నాటిన నాటి నుండి మూడు సంవత్సరాలు పాటు ఉపాధి హామీ పథకం కింద బిల్లులు మంజూరు చేసి రైతులకు ప్రోత్సాహం అందిస్తోంది.

ప్ర : పండ్ల తోటల పెంపకంలో ప్రభుత్వం రైతులకు ఎలాంటి ప్రోత్సాహాలు అందిస్తోంది ?

జ : పండ్ల తోటలు పెంచే రైతులకు ప్రభుత్వం ఎన్నో రకాల ప్రోత్సాహాలను అందిస్తోంది. వాటిలో ముఖ్యంగా బోరు బావులు తవ్వించడం. రైతులకు డ్రైలాండ్ హార్టికల్చర్ ద్వారా మామిడి మొక్కలు అందించి వాటిని పెంచడానికి ఎరువులను నీటిని అందించడానికి మూడు సంవత్సరాలకు ఎకరాకు రూ. 13,193, రాయితీ అందిస్తోంది. బోరు బావులు ఉన్న రైతులకు చీని చెట్ల పెంపకానికి నూ. 1,07,459 రాయితీ అందిస్తోంది. సీతాఫలం, జామ, కొబ్బరి, సపోటా తదితర పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం విరివిగా రాయితీలను అందిస్తోంది.

ప్ర : ఏయే పండ్ల తోటలకు నష్టపరిహారం అందిస్తున్నారు ?

జ : శ్రీ సత్య సాయి జిల్లాలో 2022 సంవత్సరంలో భారీ వర్షాలు రావటంతో పండ్లతోటలు పెంపకం చేసిన రైతులు నష్టపోయారు. 255 హెక్టార్లలో పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులు నష్టపోయారు. అత్యధికంగా టమోటా రైతులకు భారీ నష్టం వాటిల్లింది. శ్రీ సత్య జిల్లా వ్యాప్తంగా 110 హెక్టర్లలో టమోటా పంట నాశనమైంది. బొప్పాయి పంటకు హెక్టార్‌కు రూ.15వేలు, అరటికి రూ.25 వేలు, మామిడికి రూ.20 వేలు, నారింజ, జామ, చీనీ పండ్లకు, కాయగూరల పంటలకు రూ. 15వేలు, కొత్తిమీర పంటకు 75 వేల రూపాయలు నష్టపరిహారం మంజూరైంది.

ప్ర : పండ్ల తోటల పెంపకం దారుల నష్ట నివారణ చర్యలు ఏవి?

జ : గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు శ్రీ సత్య సాయి జిల్లాలో పండ్ల తోటల పెంపకం దారులకు అపార నష్టం వాటిల్లింది, ఉద్యానవన పంటలతో పాటు కాయగూరలు ఆకుకూరలు పండించే రైతులు నష్టపోయారు. ప్రాథమిక అంచనా ప్రకారం పంట నష్ట నివేదికను, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి జిల్లాలో 33శాతం పంట నష్టపోయిన రైతులకు గుర్తించగా వారికి నష్టపరిహారం అందజేశాం.

ప్ర : గత ఐదు సంవత్సరాల నుండి పండ్ల తోటల వలన నష్టపోయిన రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారు ?

జ : పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి సంవత్సరం నివేదికలను ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల నుండి పండ్ల తోటల నష్టానికి నష్టపరిహారం అందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు పంట నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం నివేదిక అందజేస్తున్నారు. దానిని పరిగణలోకి తీసుకొని వారికి పంట నష్టపరిహారం అందిస్తున్నాం. వీటికి తోడు పండ్ల తోటల పెంచే రైతులకు డ్రిప్పులు, పైపులు ,స్ప్రింకర్లు, స్ప్రేయర్లు తదితర పరికరాలను 90శాతం సబ్సిడీ ధరలకు అందిస్తున్నాం. ఈ ఏడాది శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా రైతులకు స్ప్రింకర్లు, పైపులు విరివిగా అందజేశాం.



జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్

మంచిని చూసి ఆశీర్వదించాలి

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నో ప్రభుత్వాలు చూశాం.. ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశాం..పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అందరికీ మేలు చేసిన ముఖ్యమంత్రిని మాత్రం చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి-1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందుతోందన్నారు. పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం రూ.48 లక్షలు నాబార్డు నిధులతో నిర్మించనున్న ఉప్పరపల్లి బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు శేఖర్, రాధమ్మ, ఎంపీపీలు జడ్పీటీసీలు చంద్రకుమార్, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పాసింగ్ అవుట్ పరేడ్ వాయిదా

అనంతపురం క్రైం : నేడు జరగాల్సిన డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ ఈనెల 23వ తేదీ సోమవారానికి వాయిదా వేసినట్లు పోలీసు శిక్షణ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.వెంకటరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోంమంత్రి తానేటి వనిత, గౌరవ అతిథులుగా డీజీపీ కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటి పంపింగ్ పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండలం ఎన్.తిమ్మాపురం గ్రామ సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటి పంపింగ్ ప్రక్రియను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నీటి పంపింగ్ ప్రక్రియ వేగవంతం చేసి గతంలో కంటే ఒక మీటర్ ఎక్కువగానే నీరు నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంత వీలైతే అంత త్వరగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నింపాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రమణయాదవ్, విడపనకల్లు మాజీ ఎంపిపి రమణారెడ్డి, గ్రామస్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

పేదలపై విద్యుత్ భారం తగ్గించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి డి.పెద్దయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆదివారం మండలంలోని ఎ.కొండాపురం, అరకటవేముల, సూరేపల్లి, కడవకల్లు, పుట్లూరులో ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించడంతోపాటు బోరుబావులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలన్నారు. ప్రమాదకరమైన విద్యుత్ సంస్కరణలు రద్దు చేయాలని, ప్రయివేటీకరణ ఆపాలని, విద్యుత్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని, కార్పొరేటీకరణ విధానాలను రద్దు చేయాలని, ట్రూ అఫ్, సర్దుబాటు ఛార్జీలు, ఇతర భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సి.పెద్దిరాజు, డిహెచ్‌పిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎ.రమేష్, డి.పెద్దన్న, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, చేతివృత్తిదారుల సమైక్య మండల అధ్యక్షులు సి.ఓబుళపతి, రైతుసంఘం నాయకులు శేఖర్‌యాదవ్, కుళ్లాయప్పయాదవ్, సూరేపల్లి గ్రామ శాఖ కార్యదర్శి రామాంజనేయులు, నారాయణ, దావీదు, నల్లప్ప, అన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలి : ఏపిఎం

ప్రజాశక్తి-నార్పల

మలవిసర్జన తర్వాత, ఆహారం తీసుకునే ముందు తరచుగా చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలని ఏపిఎం తిప్పమ్మ సూచించారు. 'గ్లోబల్ హ్యాండ్ వాష్ డే' సందర్భంగా ఆదివారం మండలంలోని గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు చేతులను శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపిఎం మాట్లాడుతూ ప్రజలు తరచూ చేతులను శుభ్రం చేసుకునే అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే సబ్బు, హాండ్‌వాష్ లిక్విడ్ తయారు చేసేందుకు ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఆదివారం హ్యాండ్ వాష్ డే నిర్వహించినట్లు ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్ తెలిపారు.చేతులు శుభ్రం చేయకపోవడం వల్ల వచ్చే సమస్యలు గురించి సభ్యులకు అవగాహన కల్పించారన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు నాలుగుసార్లు సబ్బుతో గాని లిక్విడ్ తో గాని చేతులు శుభ్రంగా కడుక్కోవాలి అని సూచించారు. కార్యక్రమం లో వి.వో లీడర్లు, సంఘం సభ్యులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చేతులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

జెఎన్‌టియు రిజిస్ట్రార్ శశిధర్

ప్రజాశక్తి-అనంతపురం

నిరుపేద కుటుంబం నుంచి వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసిన మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని జెఎన్‌టియు రిజిస్ట్రార్ సి.శశిధర్ కొనియాడారు. అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక జెఎన్‌టియు విశ్వ విద్యాలయంలోని పరిపాలనా భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఒక నిరుపేద కుటుంబం నుంచి వచ్చి భారత రాష్ట్రపతిగా ఎదిగిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఇండియా రక్షణ, పరిశోధన రంగంలో ఆయన కృషి మరవలేనిదని, రాష్ట్రపతిగా భావితరాలు ఉజ్వల పథంలో పయనించేలా ఎన్నో స్ఫూర్తి సందేశాలను అందించారని గుర్తు చేశారు. ముఖ్యంగా బాలిస్టిక్ క్షిపణి, వాహన ప్రయోగ టెక్నాలజీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశోధకుడిగా ముందుకు సాగినప్పుడే దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టగలమన్నారు. దేశ శాంతి, సమాజ హితమే అభ్యుదయ మంత్రంగా భావించి తన జీవితాన్ని విద్యార్థులతోనే కడదాకా గడిపిన మహోన్నత వ్యక్తి కలాం అన్నారు. 'కలలు కనండి.. సాకారం చేసుకోండి' అని యువతను మేలుకొల్పి అందరి చేత ది మిస్సైల్ మ్యాన్ అఫ్ ఇండియాగా పిలువబడ్డారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, డైరెక్టర్లు జి.వి.సుబ్బారెడ్డి, ఎ.సురేష్‌బాబు, ఓటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, డి.విష్ణువర్ధన్, ఎం.రామశేఖరరెడ్డి, మాజీ ఆచార్యులు వి.శంకర్, డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.ఎ.ఎ.సాయిమనీష్, సెక్యూరిటీ హెడ్ ఎస్.వెంకటేష్, బోధన, బోధనేతర, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



అబ్దుల్ కలామ్‌కు నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు రిజిస్ట్రార్, సిబ్బంది

ఎస్‌కెయు ఇంజినీరింగ్ కళాశాలలో..

అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఎస్‌కెయు ఇంజనీరింగ్ కళాశాలలో చిత్రపటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ దేశ మిస్సైల్ రూపకల్పనలో అబ్దుల్ కలాం విశేష సేవలు చేసి భారత మిస్సైల్‌గా పేరు తెచ్చుకున్నారన్నారు. ముఖ్యంగా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ వాహన సాంకేతికత, పోఖ్రాన్-11 అణు పరీక్షల్లో కీలకమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలి

17 నుంచి ఆటోజాతా - సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ అభివృద్ధికి రూ.10వేల కోట్లు మంజూరు చేయాలన్నారు. అలాగే హెచ్‌ఎల్‌సి ఆధునీకరణ పనులు చేపట్టాలని, రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ, సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, గ్రామాల్లో వలసలను నివారించేందుకు విరివిగా ఉపాధి పనులు కల్పించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణను ఆపాలని, నిరుద్యోగ యువతకు అధునాతన పద్ధతుల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించాలని, వృత్తిదారులందరికీ రక్షణ చర్యలు చేపట్టాలని, కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎల్‌సి బైపాస్ కాలువ పనులు చేపట్టి చివరి ఆయకట్టు వరకూ సాగునీరు ఇవ్వాలని, మండల కేంద్రాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మారక భవనాలకు స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించాలని, శింగనమల మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న లిడ్ క్యాప్ చెప్పుల పరిశ్రమ ప్రారంభించాలని, శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని, ఉల్లికల్లు గ్రామ ముంపు బాధితులకు పరిహారం ఇచ్చి పునరావాసం ప్యాకేజీ అమలు చేయాలని, శింగనమల జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపీసీ ఇంగ్లీష్ మీడియం గ్రూపులు ఏర్పాటు చేసి. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు, పంట వేయని రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని, భూమిలేని నిరుపేదలకు మూడెకరాలు సాగుభూమి ఇవ్వాలని, అర్హులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని, కల్లుమడి గ్రామంలో ప్రభుత్వ భూముల్లో పండ్లతోటలు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 17వ తేదీ నుంచి ఆటోజాతా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆటో జాతాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, రామాంజనేయులు, గంప మల్లయ్య, ధన, మేకల పెద్దన్న, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్, సుంకన్న, వెంకటస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబిరెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో వైసిపి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోకార్యకర్తలు, నాయకులు చిన్న చిన్న సమస్యలను పక్కన పెట్టి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. సిఎం జగన్ నాడు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత 99 శాతం అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా 87 శాతం ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చారన్నారు. మహనీయు స్ఫూర్తితో జగన్ గొప్ప పరిపాలనా సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో మహిళలు నిర్లక్ష్యానికి గురైతే.. జగన్ పాలనలో వారి సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. వైఎస్ఆర్ ఆసరా ద్వారా ఇప్పటికే 19,500 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. మరో రూ.6,500 కోట్లు జమ చేయడానికి ప్రభుత్వం సిద్ధమతోందన్నారు. ఇకపోతే స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి కేసులో చంద్రబాబు అరెస్టు అయితే దాన్ని అడ్డుపెట్టుకుని సానుభూతి పొందేందుకు అనేక ఆందోళనల పేరుతో టిడిపి శ్రేణులు డ్రామాలాడుతున్నాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబును అరెస్టు చేస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న పయ్యావుల కేశవ్ ఉరవకొండ నియోజవర్గంలో ఒక్క ఆందోళనలో కూడా పాల్గొనడానికి ధైర్యం చేయలేకపోయారన్నారు. కేశవ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు అందుబాటులో లేకుండా కేవలం హైదరాబాద్, విజయవాడకే పరిమితమయ్యారని విమర్శించారు. జగన్ పాలనలో ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళుతుందని ఇప్పటికే డిబిటి, నాన్ డిబిటి ద్వారా రూ.4.20కోట్లు ప్రజలకు పరోక్షంగా, ప్రత్యక్షంగా లబ్ధి చేకూరిందన్నారు. 32 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి వారిని లక్షాధికారులను చేశారన్నారు. కోవిడ్ సమయంలో కూడా జగన్ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా చక్కని సేవలు అందించిందని గుర్తు చేశారు. నవంబర్ 1 నుంచి జరిగే జగనే ఈ రాష్ట్రానికి ఎందుకు కావాలని కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు వీరన్న, కోదండరామ్, సోమశేఖర్‌రెడ్డి, ఉస్మాన్, ఉమాపతి, ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, వసికెరి రమేష్, ధర్మపురి హనుమంతురెడ్డి, భీమా, కృష్ణ, సర్పంచి మోనాలిసా, ఎంపిపిలు పుష్పావతి భీమిరెడ్డి, దేవీబాయి, వైస్ ఎంపీపీలు సుశీల రాణి, సుంకమ్మ, సుశీలమ్మ, సుధీర్‌రెడ్డి, హనుమంతు, మోదుపల్లి సునీతారాణి, సర్పంచులు మోదుపల్లి రామాంజనేయులు, రామాంజనేయులురెడ్డి, కేసన్న, సుశీలా ఉమాశంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్ మృతి

గుత్తి : నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవర్ రఫీక్ (52) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌లోని రహదారిపై ఓ లాడ్జ్ ఎదురుగా ఈనెల 11న ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్ర గాయాలైన రఫీక్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అతని పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు వెల్లడించారు.

వ్యక్తికి కత్తిపోట్లు

అనంతపురం క్రైం : నార్పల మండలం దుగ్గం గ్రామానికి చెందిన సాకే మారెప్ప శనివారం రాత్రి కత్తిపోట్లకు గురయ్యాడు. త్రీ టౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. నార్పల మండలం దుగ్గం గ్రామానికి చెందిన మారెప్పకు కళ్యాణదుర్గం మండలం బాలవెంకటాపురానికి చెందిన రాజమ్మతో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసైన మారెప్ప భార్యతో విబేధించి అనంతపురంలో బేల్దారి పనులు చేసుకుంటూ రాత్రి సమయాల్లో ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిద్రించేవాడు. ఈనేపథ్యంలో శనివారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు గొడవ పడుతుండగా మారెప్ప విడిపించడానికి వెళ్లాడు. రెండు గంటల అనంతరం గొడవ పడిన వారిలో ఒక వ్యక్తి వచ్చి నాకే చెబుతావా.. అంటూ కత్తితో పొడిచాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు

అనంతపురం : అనంతపురంలోని ఆర్యన్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఆర్యన్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 విభాగంలో ఫణీంద్ర, జస్వంత్, కెన్నీ సాల్మన్, అండర్-17లో ఉద్యతి, దీక్ష, సోహ, అజయ్, సశాంక్, కృష్ణ మృత్విక్, చరితేష్, అండర్-14లో ధాత్రి, దీక్ష, కార్తికేయ, నాగయశ్వంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరిని అకాడమీ ప్రెసిడెంట్ లింగాల నరసింహారెడ్డి, కోచ్‌లు శ్రీకాంత్, శ్రీనివాస్ అభినందించారు.

సాగులో మంచి విత్తనాన్ని ఎంచుకోవాలి

అనంతపురం : వ్యవసాయంలో మంచి విత్తనాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యమని కెవికె శాస్త్రవేత్త మల్లేశ్వరి సూచించారు. రెడ్స్ ఎన్‌జిఒ, ఆత్మ, కెవికె ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం మండలం కురుగుంట ఉమ్మడి వ్యవసాయ క్షేత్రంలో గ్రామీణ మహిళా కిసాన్ దివాస్, ఆహార భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు మందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు చేయాలన్నారు. ఫలితంగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, భూసార పరీక్షల శాస్త్రవేత్త నాగరాజు, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ అధినేత భానుజ, 65 మంది మహిళా రైతులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రలో పాల్గొన్న 'డేగల'

శింగనమల : టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు చేపట్టిన ప్రజా సామ్య పరిరక్షణ సైకిల్ యాత్రలో అనంతపురం టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి పాల్గొని సంఘీభావం తెలిపారు. మూడోరోజు ఆదివారం నియోజకవర్గంలోని యల్లనూరు మండలం కూచివారిపల్లి నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంఎస్.రాజుతో కలిసి సైకిల్ యాత్రలో ముందుకు సాగారు. ఈకార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, మాజీ ఎంపిటిసి చిక్కాల చంద్రాయుడు, బిసి సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి లోలూరు నారాయణస్వామి, జిల్లా ఎస్సీ సెల్ మీడియా కోఆర్డినేటర్ మొండిపోగుల ఎర్రిస్వామి, నియోజకవర్గ అధ్యక్షులు డాల్ వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు 'ఉపాధి' పనులు కల్పించాలి

పెద్దపప్పూరు : గ్రామాల్లో వలసలను నివారించేందుకు ప్రభుత్వం 200 రోజులు ఉపాధి పనులు కల్పించడంతోపాటు రూ.600 కూలి పడేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, ఎపి చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు కాసెట్టి నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని హరేరామ ఆశ్రమంలో ఎపి వ్య.కా.సం మండల కార్యదర్శి అమ్మలదిన్నె కుళ్లాయప్ప అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈనేపథ్యంలో గ్రామంలో వలసలు పెరిగే అవకాశం ఉందన్నారు. కావున కరువు, వలసల నుంచి రైతు, కూలీలను రక్షించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం రూ.600 చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సమస్యలపై చర్చించేందుకు ఈనెల 17న జిల్లాకేంద్రంలో ఎపి వ్య.కా.సం రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డే రాజా, గుర్రం మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రులు ప్రారంభం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో దేవీ శరన్నవరాత్రులు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పట్టణంలోని శాంతినగర్‌లోని బన్నీ మహంకాళి దేవాలయం, ఓబులాచారి రోడ్డు వద్ద ఉన్న మహంకాళి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోటలోని నగరేశ్వర స్వామి ఆలయంలో వాసవీమాతను రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. ఎన్టీఆర్ కూడలిలోని హాటకేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా దేవి పురాణ పఠణం ప్రారంభించారు. నేసేపేటలోని చౌడేశ్వరీదేవి, కల్లిమఠం వద్ద ఉన్న మహాలక్ష్మి, బళ్లారి రోడ్డు వద్ద ఉన్న గద్వాల్ ఎల్లమ్మ, వరలక్ష్మి వీధిలోని వరలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవీధిలో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. ప్రజలు భక్తులు ఆలయాలను సందర్శించి పూజలు చేశారు.



పూజలందుకున్న అమ్మవారు

పుట్లూరు : దేవీ నవరాత్రుల్లో పురస్కరించుకుని ఆదివారం మండల పరిధిలోని బాలపురం గ్రామంలో కాళికామాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహానికి 9రోజులపాటు పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. కాళికామాత దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైద్య-చికిత్సకు ఆర్థికసాయం

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో ఉన్న శ్రీదేవి, చంద్ర దంపతుల కుమారుడు నవీన్‌కుమార్ వైద్య చికిత్సల కోసం గ్రామస్తులు ఆదివారం ఆర్థికసాయం చేశారు. నవీన్‌కుమార్ ఇటీవల అనంతపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి శస్త్ర చికిత్స కోసం గ్రామస్తులు పోగుచేసిన రూ.87వేలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న తొండపాడు గ్రామస్తులు

జగన్ భారీ మూల్యం చెల్లించక తప్పదు

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు - చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

ఒక నిజాయితీపరున్ని మానసిక శోభకు గురి చేస్తున్న సిఎం జగన్ రాబోయే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించకోకక తప్పదని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. న్యాయానికి సంకెళ్లు పేర టిడిపి ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనల్లో భాగంగా ఆదివారం రాయదుర్గంలోని తన నివాసం వద్ద చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయం మంట కలిసి పోయిందన్నారు. నియంతృత్వ పోకడలు, ఏకపక్ష విధానం, రాక్షస మనస్తత్వంతో జగన్ చేసిన వికృత క్రీడకు ఓ నిజాయితీపరుడు జైలు పాలు కావాల్సి వచ్చిందన్నారు. జైలులో చంద్రబాబు డిహైడ్రేషన్‌తో బాధపడుతుండటంతోపాటు శరీరంపై ఎర్రటి దద్దుర్లు వచ్చి బాధ పడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. జైలు వాతావరణం ఆయనకు మంచిది కాదని వైద్యుల సలహా ఇచ్చినప్పటికీ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్రంలోనేకాక దేశ, విదేశాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు మహబూబ్‌బాషా, వెంకటేశులు, మోహన్‌రెడ్డి, బండి భారతి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు నల్ల రిబ్బన్లతో సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవళ్ల మురళి, సరిపూటి రమణ, మారుతీకుమార్‌గౌడ్, బంగి నాగ, స్వామిదాస్, కాకర్ల ఆదినారాయణ, ముక్తియర్ హొన్నూర్ జెఎం.బాషా, మహిళలు తేజశ్విని, జానకి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో శాంతిర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం వరకూ సాగింది. అనంతరం చెన్నకేశవ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి తనయుడు మధుకర్‌చౌదరి మాట్లాడుతూ పసుపు జెండాకు సిఎం గజన్ భయపడుతున్నాడన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యా న్ని రక్షించాలని, అరాచకం మితిమీరి పోయిందని, ప్రతిపక్ష నాయకులను అణచివేయడమే లక్ష్యంగా జగన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఏ తప్పూ చేయని చంద్రబాబును అన్యాయంగా కస్టడీకి పంపారన్నారు. జైల్లో కూడా సరైన సౌకర్యాలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు మాట్లాడుతూ చంద్రబాబుకు హాని తలపెడితే రాష్ట్రం రావణకాష్టంలా మారుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు సుధాకర్‌యాదవ్, బంగినాగ, గాజుల ఆదెన్న, సరిపూటి రమణ, నారాయణస్వామియాదవ్, రాజారావు, వన్నూరు, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, సంఘ తేజస్విని, కృష్ణవేణి, మనెమ్మ, తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గంలో చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, నాయకులు

నార్పల : చంద్రబాబు నాయుడు అక్రమ రిమాండ్‌కు నిరసనగా మండలం కేంద్రంలో ఆదివారం 'న్యాయానికి సంకెళ్లు' కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు మాట్లాడుతూ అవినీతి బురదలో నిండా మునిగిన జగన్ ఆ బురదను అందరికీ అంటించేందుకు పన్నిన కుట్రలో భాగమే స్కిల్ డెవలప్‌మెంట్ కేసు అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చంద్రబాబుని అరెస్టు చేసి జైలులో పెట్టడం జగన్ నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. చంద్రబాబుని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.